# మిస్సెస్ వరల్డ్ పీస్.. చంద్రిక

## కిరీటాన్ని సొంతం చేసుకున్న నిర్మల్ వైద్యురాలు

- దేశవ్యాప్తంగా ఖ్యాతిని ఇనుమడింప చేసిన తెలుగు మహిళ
- వివిధ రాష్ట్రాలకు చెందిన 140 మందితో పోటీపడి అవార్డు కైవసం
- అందరి ప్రోత్సాహంతోనే ఎంపిక : డాక్టర్ చంద్రిక అవినాష్

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 4 : నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక అవినాష్ ప్రతిష్టాత్మకమైన మిస్సెస్ వరల్డ్ పీస్ ఇంటర్నేషనల్-2024 అందాల పోటీల్లో కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక వృత్తిని, కుటుంబ బాధ్యతలను మోస్తూనే, తన చిరకాల కోరికైన అందాల పోటీల్లో పాల్గొంటున్నారు. గత నెలలో గ్లామర్ గుర్‌గావ్ సంస్థ హైదరాబాద్‌లో నిర్వహించిన అందాల పోటీల్లో పాల్గొని ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. తాజాగా హర్యానా రాష్ట్రంలోని గుర్‌గావ్‌లో మే 28 నుంచి జూన్ 1 వరకు నిర్వహించిన ఫైనల్స్ పోటీల్లో పాల్గొన్నారు. ఆమె 140 మంది పోటీదారులలో అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి మిస్సెస్ ఇంటలెక్చువల్ సబ్ టైటిల్, మిస్సెస్ వరల్డ్ పీస్ కిరీటాన్ని అందుకున్నారు.



డాక్టర్ చంద్రిక అవినాష్

### అందరి ప్రోత్సాహంతో అవార్డుకు ఎంపిక : చంద్రిక

డాక్టర్ చంద్రిక వైద్య వృత్తిలో రాణిస్తూనే అందాల పోటీల్లో పాల్గొంటున్నారు. చంద్రిక భర్త డాక్టర్ అవినాష్ నిర్మల్ పట్టణంలో ప్రముఖ వైద్యుడు. భార్యాభర్తలు ఇద్దరూ వైద్య వృత్తి నిర్వహిస్తున్నారు. వీరికి పాప, బాబు ఉన్నారు. భర్త ప్రోత్సాహం, అత్తగారు దేవీబాయి, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సోషల్ మీడియా ఫాలోవర్స్‌కు ఈ అవార్డును అంకితం ఇస్తున్నట్లు తెలిపారు. తన గురువు మెంటర్, గ్లామర్ గుర్గావ్ డైరెక్టర్ బార్ఖ నాంగియా ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు ఆమెను అభినందించారు.

# అధ్వానంగా బీటీ రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వేడుకలు

నార్నూర్, జూన్ 4 : దేవ్‌పటార్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుకు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్లను బాగు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆసలే వర్షాకాలం కావడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది. గతంలో బీటీ రోడ్డు మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. రోడ్డుపై కంకర తేలడంతో ప్రజలతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలి అధ్వానంగా దేవ్‌పటార్ బీటీ రోడ్డు

# బధిరుల బడిలో ప్రవేశాలకు ఆహ్వానం

ఎదులాపురం, జూన్ 4 : ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను బధిర, దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ జిల్లా అధికారి సబిత ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని పాఠశాలలో బాలబాలికలకు 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లిష్, 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో ప్రవేశాలకు ఆరు నుంచి 14 సంవత్సరాలు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన చెవిటి(బధిర) బాలబాలికలకు ప్రవేశానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ పాఠశాలలో ఉచితంగా విద్య, పాఠ్య, నోటు పుస్తకాలు, స్కూల్ యునిఫాం, భోజన, వసతి గృహ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రవేశాల కొరకు దివ్యాంగ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, టీసీ, ఆధార్ కార్డులతో ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల, మల్కాపూర్ రోడ్, శాతావాహన యునివర్సిటీ ఎదురుగా విజయపురికాలనీ కరీంనగర్‌లో సంప్రదించాలన్నారు. ఇతర వివరాల కోసం 9000013639, 9000221301, 9666868755కు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని బధిర, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# చిరు జల్లులు



బోథ్‌లో కురుస్తున్న వర్షం

బోథ్/నిర్మల్ అర్బన్/నార్నూర్, జూన్ 4 : మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. రుతు పవనాల ప్రభావంతో అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసింది. మృగశిర కార్తె మరో నాలుగు రోజుల్లో ప్రవేశిస్తుండడం, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. బోథ్, పొచ్చెర, సోనాల, ధన్నూర్(బీ), కౌట(బీ), కన్గుట్ట గ్రామాల పరిసరాల్లో వర్షం కురిసింది. వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. వర్షం మూలంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో కూడా చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. నార్నూర్ మండలంలో కూడా ఒక గంటపాటు వర్షం కురువడంతో వాతావరణం చల్లబడింది.

# కమల వికాసం

## 90,652 ఓట్ల ఆధిక్యతతో బీజేపీ అభ్యర్థి నగేశ్ గెలుపు

- ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెజార్టీ
- ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యత



టీటీడీసీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన అనంతరం విక్టరీ సింబల్ చూపిస్తున్న ఎంపీ గొడం నగేశ్

ఆదిలాబాద్, జూన్ 4(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి గొడం నగేశ్ 90,652 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన ఓట్ల లెక్కింపు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఆదిలాబాద్, బోథ్.. పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మల్, మథోల్, ఖానాపూర్.. సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. రిటర్నింగ్ అధికారితోపాటు పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలను తెరిచి కౌంటింగ్ ప్రారంభించారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. తర్వాత ఈవీఎంలలో పోలైన ఓట్లను కౌంట్ చేశారు. మొదటి రౌండ్ నుంచి బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్ ఆధిక్యత కనపబరుస్తూ వచ్చారు. 23 రౌండ్ల ఓట్ల లెక్కింపు కొనసాగగా చివరి రౌండ్ ముగిసే సరికి నగేశ్‌కు 5,68,168 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు 4,77,516 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీ ఆధిక్యత ప్రదర్శించింది. గొడం నగేశ్‌కు 9,232 ఓట్లు రాగా.. ఆత్రం సుగుణకు 5,183 ఓట్లు వచ్చాయి. పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ఆరు నియోజకవర్గాల్లో బీజేపీకి ఆధిక్యత లభించింది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సుగుణకు మెజార్టీ వచ్చింది.



జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగాఎంపీగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గొడం నగేశ్

### మొదటి రౌండ్ నుంచి ఆధిక్యత

విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి మొదటి రౌండ్ నుంచి ఆధిక్యత లభించింది. మొత్తం 23 రౌండ్లకు ప్రతి రౌండ్‌లో బీజేపీ ముందంజలో నిలిచింది. మొదటి రౌండ్‌లో బీజేపీకి 8806 ఓట్లు, రెండో రౌండ్‌లో 20,326, మూడో రౌండ్‌లో 27,657, నాలుగో రౌండ్‌లో 31,965, ఐదో రౌండ్‌లో 32,794, ఆరో రౌండ్‌లో 34,846, ఏడో రౌండ్‌లో 37,649, ఎనిమిదో రౌండ్‌లో 46,118, తొమ్మిదో రౌండ్‌లో 48,385, పదో రౌండ్‌లో 50,983, పదకొండో రౌండ్‌లో 50,913, పన్నెండో రౌండ్‌లో 53,543, పదమూడో రౌండ్‌లో 57,290, పద్నాలుగో రౌండ్‌లో 57,029, పదిహేనో రౌండ్‌లో 62,470, పదహారో రౌండ్‌లో 62,427, పదిహేడో రౌండ్‌లో 62,366, పద్దెనిమిదో రౌండ్‌లో 68,134, పంతొమ్మిదో రౌండ్‌లో 74,790, ఇరవయ్యో రౌండ్‌లో 78,318, ఇరువై ఒకటో రౌండ్‌లో 81,994, ఇరువై రెండో రౌండ్‌లో 85,447, ఇరువై మూడో రౌండ్‌లో 86,883 ఓట్ల అధిక్యత లభించింది. పోస్టల్ ఓట్లు 4049 కలుపుకుని చివరి రౌండ్ ముగిసే సరికి బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్ 90,652 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. విజయం సాధించిన నగేశ్‌కు రిటర్నింగ్ అధికారి రాజర్షి షా ధ్రువీకరణ పత్రం అందజేశారు. బీజేపీ విజయంపై ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి.

### సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీగా విజయం సాధించిన గొడం నగేశ్ తెలిపారు. ఇందుకు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల సహకారం తీసుకుంటానన్నారు. సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, రైల్వే పనులు, విద్య, ఆరోగ్యంతోపాటు కేంద్రం పరిధిలో ఉన్న పనులను పూర్తి చేస్తానని, ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

*- గొడం నగేశ్, ఎంపీ, బీజేపీ.*

### కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నిర్మల్ అర్బన్, జూన్ 4 : ఆదిలాబాద్ జిల్లాలోని సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌకర్యాలు, భద్రతను పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీసీ ఎదుట బీజేపీ నాయకుల సంబురాలు



జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కాకముందే వెళ్లిపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ

# కటక్ కట

- వేళాపాళా లేని విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు
- కేసీఆర్ హయాంలో పదేండ్లు కష్టాలు లేవన్న రైతులు



కుచులాపూర్ శివారులో నీళ్లు లేక ఎండకు వాడిపోతున్న మెంతికూర

తాంసి(తలమడుగు), జూన్ 4 : 'పదేండ్లు ఇరాం లేకుండా కరెంట్ వచ్చింది. బోరు వేస్తే పొలం మొత్తం తడిచే వరకు నడుస్తుండే. కరెంట్ పోతదేమో అన్న ముచ్చటే లేకుండే. ఇప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలవడం లేదు. రాత్రనక, పగలనక పొలం కాడికి ఉరికే పరిస్థితి వచ్చింది.' అంటూ ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కుచులాపూర్, పల్సి శివారులోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా కరెంట్ సరఫరా సక్రమంగా లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి కష్టాలు ఎప్పుడూ చూడలేదని గుర్తు చేసుకుంటున్నారు. పది రోజులుగా కరెంట్ కష్టాలు ఎక్కువయ్యాయని, తరచూ కరెంట్ పోవడం, రావడంతో మోటర్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని వాపోయారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా ఫలితం ఉండడం లేదని ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. అయితే ఇటీవల ఈదురుగాలులకు కుచులాపూర్, పల్సి శివారులోని పొలాల్లో ఏకంగా పది రోజులుగా త్రీఫేజ్ సౌకర్యం లేకపోవడంతో కూరగాయలు, పంటలు ఎండిపోతున్నాయి.

### స్తంభం బిగించారు.. కనెక్షన్ మరిచారు..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విద్యుత్ అధికారుల పనితీరు మారడం లేదు. మండలంలోని పొన్నారి గ్రామంలో త్రీఫేజ్ సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభం విరగడంతో మరమ్మతులు చేయాల్సిన అధికారులు స్తంభాన్ని మాత్రం బిగించారు.. కానీ.. కనెక్షన్ ఇవ్వడం మరిచారు. దీంతో ఆ ప్రాంతంలోని రైతులకు త్రీఫేజ్ సరఫరా లేక ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. విరిగిన స్తంభాన్ని తీసేసి, బిగించిన స్తంభానికి కనెక్షన్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. లేదంటే కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకవెళ్తామని హెచ్చరిస్తున్నారు.



నీళ్లు లేక బీటలు వారుతున్న కొత్తిమీర తోట

### రెండెకరాల తోట ఎండింది..



నేను ఎవుసం మొదలు పెట్టి పనులు చేస్తూ పదిహేనేండ్లు అవుతున్నది. ఆ నాటి కరువు మల్లగిప్పుడు వచ్చింది. నీళ్లు లేక రెండెకరాల్లో మా దాదా వేసిన వంకాయలు, కొత్తిమీర, మెంతికూర, పాలకూర తోట ఎండిపోయింది. దాంట్లో లక్షకు పైగా చేతికొచ్చిన పంట నేలపాలైంది. రాబోయే రోజుల్లో ఎట్లుంటదో భయమేస్తున్నది. పొలం ఉండి కూలీ చేస్తూ బతుకుతున్నం. వారం రోజుల్లో కరెంటు లేక తాగడానికి కూడా నీళ్లు లేవు. ఎడ్ల బండి మీద రెండు కిలో మీటర్లు పోయి నీళ్లు తెచ్చుకుంటున్నం.

*- తుకారాం, వ్యవసాయ కూలీ, కుచులాపూర్*

### రైతులను పట్టించుకుంటలేరు..



నాకు ఎనిమిదెకరాల పొలం ఉంది. అందులో రెండున్నర ఎకరాల్లో కొత్తిమీర, పాలకూర, మెంతికూర, గంగావాయిల్, తోట కూరలు పండించా. నీళ్లున్నా.. త్రీఫేజ్ కరెంటు లేకపోవడంతో చేతికొచ్చిన రూ.50 వేల కొత్తిమీర పంట ఎండిపోయింది. ఇంకా పాలకూర, మెంతికూర, గంగవాయిల్ పంటలు కూడా ఎండిపోతున్నాయి. కరెంటు సార్లకు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించి కరెంట్ వచ్చేటట్లు చూడాలి. పదేండ్లలో కరెంటు కష్టాలు లేవు.

*- సుకుమార్ పెట్కులే, రైతు, కుచులాపూర్.*



మరమ్మతులు చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న పొన్నారి రైతులు